

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

– డా. నందమూరి లక్ష్మీపార్వతి



*డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం* **'ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు - భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ'** *నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు - కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!*

(గత సంచిక తరువాయి)

**ఈ చిత్రంలో** సన్నివేశాలు, వాటికంటే సంభాషణలు చాలా ప్రత్యేకంగా ఉన్నాయి. లోతైన జీవన రహస్యాలతో పాటు గొప్ప ఆధ్యాత్మికత కూడా జోడించబడింది. ఆత్రేయగారి అనుభవమంతా ఈ సంభాషణల్లో కూర్చారనిపించింది. మానవుడి సమస్యల గురించి నారదుడు బ్రహ్మలోకం వెళ్ళి బ్రహ్మ దగ్గర ఆవేదన చెందుతాడు. ఎంతకాలం మానవుడికీ విధి మీద పోరాటం అని అడిగితే బ్రహ్మ చెబుతాడు. కాలచక్రగతిలో ఏర్పడే తరంగాలే జీవనమరణాలు నారాయణమూర్తిని అడుగుతాడు నారదుడు. మృత్యువు జయించటానికి మానవుడికి సాయం చేయగలరా? అని లయకారుని అధికారానికి అడ్డుపడటం అన్యాయం అని ఆయన సమాధానం. నారదుడు శివుడి దగ్గరకెళతాడు. ప్రళయకాల సంహారకునే కాని ప్రకృతి నియమాన్ని మార్చలేను. అనంతమైన శక్తి ఏదో ఉంది. అన్వేషించు అని ఆశీర్వదించి పంపిస్తాడు. చివరికి నారదుడు ఆదిశక్తి దగ్గర వరం పొందుతాడు. ప్రకృతి నియమానికి ఎదురీదే ఆమె తొలి ప్రయత్నమే సావిత్రి. నారదుడు మళ్ళీ యముడి దగ్గరకు వెళ్ళి చెబుతాడు. మృత్యువును సాధించే ప్రయత్నంతో మొదటి అధ్యాయం సావిత్రి దగ్గర ప్రారంభమైందని ఇది దేవి మాటలు, సాధించే లక్ష్యమున్నప్పుడు సాధన ఉండాలి. ఆ సాధకుడు సత్యవంతుడని చెబుతాడు. మంద్రదేశంలో సావిత్రి జననం. యుక్తవయస్సు వచ్చాక ఆమె మృత్యువు వాతపడ్డ ఒక మనిషిని చూసి భయపడుతుంది. అప్పుడు యముడు మృత్యువును జయించటానికి నిర్ణయించబడ్డది. సావిత్రి మొదటిసారి మృత్యువును చూడగానే ఎంత బేల అయిందో చూడు అని పరిహసిస్తాడు. సినిమా అంతా చిత్రవిచిత్రగతులతో కథ నడుస్తుంది. భారతంలో అరణ్యపర్వంలో ఒక ఉపాఖ్యానంగా ఉన్న సావిత్రి చరిత్ర ఈ చిత్రంలో అనేక మలుపులు తిరిగి తిరిగి చివరకు అసలు కథ మరుగున పడే సమయంలో హడావుడిగా మేలుకుంటుంది.

సావిత్రి కలలో సత్యవంతుడు కనిపిస్తాడు. అతడు సాళ్వదేశాధీశుడైన ద్యుమత్సేనుని కుమారుడని తెలుస్తుంది. అక్కడ మూలకథకు భిన్నంగా ద్యుమత్సేనుని ఆహ్వానించటం సావిత్రీ సత్యవంతులు కలుసుకుని ప్రేమించుకోవటం వంటి కల్పితకథా భాగం చోటు చేసుకుంటుంది. సత్యవంతుడు అల్పాయుష్కుడని నారదుడి ద్వారా తెలుస్తుంది. రుద్రసేనుడు ద్యుమత్సేనుని రాజ్యభ్రష్టుని చేసి వాళ్ళ కళ్ళు తీయిస్తాడు. యముడు సావిత్రి మీద పంతం పెంచుకుని మారువేషంలో వెళ్ళి పెళ్ళి చెడగొట్టాలని చూస్తాడు. చిత్రమంతా మృత్యువును జయించటానికి ప్రతినిధిగా సావిత్రిని దాన్నడ్డుకోటానికి పంతం పట్టి ప్రగల్భాలాడుతున్న యముని చూస్తున్నట్లనిపిస్తుంది. ఆ

ప్రాధాన్యం కొద్ది తగ్గి ఉంటే మరింత బాగుండేదేమో! వారి పెళ్ళి జరగడంతో మృత్యువు మీద మానవుడి తొలి విజయం తరువాత సత్యవంతుడు అడవికి బయలుదేరటం సావిత్రి వెంట వెళ్ళటం మామూలు కథ నడుస్తుంది. ఈ లోపు భూలోకంలో విప్లవం చెలరేగింది. మృత్యువును జయించటానికి సావిత్రి సన్నాహాలు చేస్తుంది. యమలోకంలో కూడా యముడి భార్య జయ సావిత్రి పక్షం వహించి మాట్లాడుతుంది. నారదుడు యముడికి ప్రబోధం చేస్తారు. విధిని పాటించటం దేవుళ్ళందరి విధి. అనవసరంగా నువ్వు కఠినుడవని ఎందుకు చెడ్డపేరు తెచ్చుకుంటావు. పాలనవారిది. నియమాలు మీవి అని రెచ్చగొడతారు. యముడు వైకుంఠం వెళ్తాడు. బ్రహ్మ, విష్ణువులు నాదేముంది అని తప్పించుకుంటారు. ఈశ్వరుడు నిష్పక్షపాతివి మేమంతా భక్తసులభులం. అని యముడి మీదే భారం వేస్తాడు. సత్యవంతుడి ఆశ్రమంలో జరిగే లలితాయజ్ఞాన్ని ఆపుచేయాలని యముడు ప్రయత్నిస్తాడు. చివరి సన్నివేశం తప్ప మిగిలిన చిత్రమంతా యముడికి వేరే పనిపాటలు లేనట్లు ఒక్క ఆడదాన్ని సాధించటానికి ప్రకృతి విరుద్ధంగా ఎన్నో పనులు చేస్తున్నట్లు అగుపించటం విచారకరం. సత్యవంతుడి ప్రాణం తీయటానికి యముడు వెళుతుంటే భార్య అడ్డగిస్తుంది. యముడు ఉగ్రరూపం చూపిస్తాడు ఆమె భయపడుతుంది.

వచ్చిన యముడిని అడుగుతుంది సావిత్రి 'వచ్చావా! పతిప్రాణాలు తీసుకోక తప్పదా?' 'తప్పదు తల్లీ! నీ ఒడిలో ఉన్నంతవరకు సాధ్యపడదు'. ఈ మాటలంటున్నప్పుడు ఆ ముఖంలో చూపిన భావాలు అద్భుతం. అవి ఒక సంకీర్ణ భావ స్థితికి సంకేతం. తరువాత ఆమె అనుసరిస్తుంది. ఇద్దరి మధ్య సంవాదం జరుగుతుంది. కర్తవ్యబద్ధుడైన యముడిగా రామారావుగారు చాలా సహజంగా నటించారు. ఆమె పట్టుదల అతనిలో సానుభూతి కలిగిస్తుంది. శూన్యంలో ప్రయాణం బాగా ప్రభావాన్ని చూపెడుతుంది. సూర్యగ్రహానికి యముడు నమస్కరించి ఆమెను అడ్డగించమంటాడు. సూర్యుడలాగే చేస్తాడు. సూర్యుడిని కూడా ప్రసన్నుని చేసుకుని మళ్ళీ ఆమె యముడిని అనుసరిస్తుంది. సప్తర్షి మండలం, గ్రహాలు ఆ అడ్డంకులు వాటిని అధిగమించడం అంతా సాంకేతికంగా సాహిత్యపరంగా అద్భుతమైన సన్నివేశం. సతీధర్మం అడుగంటకుండా చేయమని ఆరుంధతిని ప్రార్థిస్తుంది. అరుంధతి సావిత్రిని మెచ్చుకుంటుంది. భూలోకంలోనే కాదు నభోలోకంలో కూడా పతిని అనుసరించిన అదృష్టవంతురాలివి అని. 'భూతపిశాచాలు అడ్డగిస్తాయి సావిత్రీ! ఇకనైనా వెనక్కు తిరుగు. ఆహా! ఏమి అచంచల ఆత్మ విశ్వాసము, ఈమె ధైర్యము. నీవలె సశీరరంగా నన్ను వెన్నంటి నభోజ్యోతిర్మండలాన్ని అధిగమించి వచ్చినవారెవరూ లేరు. నేను దయారహితుడను. నిష్ఠుర ధర్మ నిర్వహణలో కర్తవ్యపరాయణుడను' అని తనకు తనే ఆత్మగతంగా అనుకుంటున్నప్పుడు ఓ విచిత్రమైన విషయాన్ని ఒక విధమైన జీరతో పలికిస్తారు రామారావుగారు. ఈ పాత్రకు రావణాసురుడు పాత్రకు దగ్గర పోలికలున్నాయి. అద్భుతమైన గ్రాఫిక్స్, యమలోకంలో వెళ్ళే సరికి యముడు నల్లగా మారతాడు జగన్మాత ప్రత్యక్షమవుతుంది. యముడు కీర్తిస్తాడు. అమ్మవారి దర్శన దృశ్యం చాలా బాగా తీసారు. అన్ని ధర్మములకంటె ఉత్తమమైంది కరుణ అదే మాతృత్వము అని అమ్మ చెబుతుంది. చివరకు సత్యవంతుడి ప్రాణాలు తిరిగి ఇస్తాడు .

"ఆదిశక్తి స్వరూపాన్ని సాక్షాత్కరింపచేసావు నీ తల్లితండ్రులకు పుత్రభిక్షప్రసాదిస్తున్నాను నీకు పుత్రసంతానం ఇస్తున్నాను అని యముడు వరప్రదానం చేస్తాడు. అప్పుడు అడుగుతుంది సావిత్రి. పతిలేక పుత్ర సంతానమెట్లాగని. అప్పుడు యముడు ఆమె పతిప్రాణాలను ప్రసాదించక తప్పలేదు. ఆ చివరి సన్నివేశం రామారావుగారి పండిన నటనికి గొప్ప తార్కాణం. అయితే ఇంతసేపు అదిశక్తి బొమ్మలాగా నిలబడి చూస్తుంది. ఆమె ముందే యముడు సావిత్రి మాట్లాడుకుంటూ ఉంటారు. ఇదికొంత అనుచితంగా ఉంది. ఈ చిత్రంలో కొన్ని చోట్ల యముడు అతిగా ప్రవర్తిస్తాడు. ఏది ఏమైనా యముడిగా కూడా నటించి ప్రేక్షకులను మెప్పించగలిగారన్నది యధార్థం. ఈ చిత్రం కూడా మంచి ప్రేక్షకాదరణ పొందింది.

***కర్ణ:***

1963లో శివాజీ గణేశన్‌గారు కర్ణుడిగా నటించి మెప్పించిన చిత్రం 'కర్ణ'. అదే చిత్రంలో శ్రీకృష్ణుడిగా రామారావుగారు నటించినా - కర్ణుడికి మంచి పేరు రావటంతో ఆ ప్రభావం రామారావుగారి మీద కూడా పడింది. అప్పటికి బీజస్థితిలో ఉన్నవారి ఆలోచన 1977 దానవీరశూరకర్ణ నాటికి మహావృక్షమైంది. అందుకే ప్రత్యేక శ్రద్ధతో కర్ణ పాత్రను తీర్చిదిద్దారు. ఎప్పుడూ తనదైన ప్రత్యేకశైలిని చూపించే రామారావుగారు భారత కర్ణుడిలోని ఔన్నత్యాన్ని పోషిస్తూనే మరికొంత ముందడుగు వేసి ఏకంగా వర్ణవ్యవస్థ మీద తిరుగుబాటు చేసే కథానాయకుడిగా నిలబెట్టారు. భారతంలోని కర్ణపాత్రకున్న అనౌచిత్యాలన్ని తొలగించి ఈ చిత్రంలో సంపూర్ణ మానవతావాదిగా - దానవీరుడిగా - శూరుడుగా అనుభవాల కడలిలో నలిగి జీవితగమనంలో ఒడిదుడుకులనెదుర్కొన్న పరిణత మనస్కుడుగా తీర్చిదిద్దారు. నిజం చెప్పాలంటే కర్ణుడికన్న ఒకటి, రెండు మంచి గుణాలకు రామారావుగారు అదనంగా చేర్చినవెన్నో - అందుకే 'దానవీరశూరకర్ణ'లో రామారావుగారి కర్ణుడు చాలా హుందాగా - శాంతగంభీరంగా దర్శనమిస్తాడు. ఈ పాత్రకు మూలంలోని అనౌచిత్యాలెన్నో పరిహరించబడ్డాయి. కొన్ని కల్పితాంశాల్లోకూడా ఔచిత్యం పాటించబడింది. అతడిని చక్రవర్తి ఒక్కటే చేయలేకపోయారు కానీ మిగిలిన విషయాల్లో ఏ లోటూ రానివ్వలేదు. కర్ణపాత్రకోసం తన కృష్ణపాత్రను కూడా త్యాగం చేసిన సందర్భం ఈ చిత్రంలో గమనిస్తాము.

ప్రధానంగా శివాజీ గణేశన్ 'కర్ణ' పాత్రలో ఉన్న లోపాలను ఈ చిత్రంలో సరిచేయటం జరిగింది. అందులో అతిశయించిన నటన అధికంగా మాట్లాడడం అనవసరమైన శరీర కదలికలు వీటన్నిటిని పరిహరించి సౌమ్యుడిగా, సమాజ కులరక్కసి ఉక్కుపిడికిళ్ళలో నలిగిపోతూ, తన నిస్సహాయత మీద అనుక్షణం పోరాడే ధీరమూర్తిగా, హీనస్థితినధిగమించి పౌరుషాన్ని చాటుకునే వీరుడుగా, దానకర్ణుడుగా - రామారావుగారు అభినయించిన తీరు ప్రశంసనీయం. ఎంతో హుందాగా ఈ పాత్రను నడిపించారు. ద్రౌపది విషయంలో కృష్ణుడు చేసిన అనౌచిత్యాన్ని కర్ణపాత్రద్వారా పరిహరించారు. అభిమన్యుని నిరాయుధుడిగా చంపిన తరువాత ఏకాంతంలో అభిమన్యుని శవం దగ్గర నిలబడి ఏడుస్తూ తన తప్పును ఒప్పుకుని క్షమించమని అడగటం చాలా ఉదాత్తస్థాయికి తీసుకుపోయింది. ద్రౌపదిని మాతృభావనతో మాట్లాడడం అతని స్వచ్ఛమైన శీలప్రవృత్తిని, పరస్త్రీల పట్ల అతనికున్న గౌరవాన్ని తేటతెల్లం చేసింది. అన్నిటిని మించి తిక్కనగారి 'కర్ణ' హృదయాన్ని రామారావుగారు బాగా గ్రహించారనిపిస్తుంది. మహాభారతంలో కర్ణుడి పాత్రోన్మీలమునకు సంబంధించి అతడి రహస్య సమావేశములు ౩డు. (1) కృష్ణ - కర్ణ సమాగమము (2) కుంతీ - కర్ణ సమాగమము (3) భీష్మ - కర్ణ సమాగమము. ఈ మూడు సమావేశాల్లోను ముగ్గురూ కర్ణుని జన్మ రహస్యం చెప్పినవారే. అయినప్పటికీ తను నమ్మిన స్వామికే తన ప్రాణములంకితము చేసిన విశ్వాసపాత్రుడు కర్ణుడు తనను అర్ధరథునిగా అవమానించినా, భీష్ముని ఎంతో గౌరవించిన వ్యక్తిగా ఈ చిత్రంలో కనిపించటం పూర్తిగా తిక్కనగారినర్థం చేసుకోవటమే. యుద్ధపర్వంలో తిక్కనగారి ఈ పద్యం వింటే రామారావుగారి కర్ణపాత్ర ఎలా మలచబడిందో అర్థమవుతుంది. భీష్ముడు అంపశయ్యుడయ్యాక - కర్ణుడు భీష్ముని దర్శించిన సన్నివేశానికి పోలికగా -

"నీ జయంబు వనవాసినయ్యెద రిపుల్ నిను నోర్చిన వారి నోర్చెదన్"

అని కోపంగా పలికినవాడే భీష్ముడు కూలిపోగానే ఇలా అంటాడు -

"దమము సత్యముం దపము దానము శీలమునస్త్ర వీర్య శౌ
ర్యములను భీష్మునంద కలవట్టి మహాత్ముడు పోరనీల్గె నిం
క మనకు నేటి బాహుబలగర్వము లెక్కడి సేన లక్కటా
సమ సెనె కౌరవేశ్వరుని సంపద యంచు విషణ్ణమూర్తియై"

ఈ మాటలు భీష్ముడి ప్రతిష్టకాదు - కర్ణుడి ప్రతిష్ఠ పెంచాయి. ఆ పాత్రను పూర్తిగా ఔచిత్యవంతంగా తీర్చిదిద్ది తెలుగునాట ప్రశంసలందుకున్నారు రామారావుగారు. కర్ణపాత్రకు ఒక అమరత్వసిద్ధిని కలిగించారు.

***బ్రహ్మర్షి విశ్వామిత్ర:***

1989వ సంవత్సరంలో నందమూరి తారక రామారావుగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండగా ఈ చిత్రం నిర్మితమైంది. స్వీయ దర్శకత్వంలో చాలా అట్టహాసంగా ప్రారంభమైన చిత్రం పెద్ద అపజయం పాలయింది. దానికి ఎన్నో కారణాలు. ఈ చిత్ర నిర్మాణం తలపెట్టినప్పుడే తన పక్షంలో, ఎదుటి పక్షంలో అనేక విమర్శకులకు గురైంది. రాజకీయాలు - పరిపాలన విడిచి చిత్ర నిర్మాణం మీద ఆసక్తి చూపిస్తున్నారని స్వంత వాళ్ళే విమర్శించారు. ప్రజల కష్టసుఖాలు మరచి మేనక వ్యామోహంలో పడ్డాడీ విశ్వామిత్రుడని ఎదుటిపక్షం వాళ్ళు విమర్శించారు. ఎన్నికల్లో ఇదొక బలమైన ఆయుధంగా వారు వాడుకున్నారు. ఏది ఏమైనా రామారావుగారి మనసును ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు. అప్రతిష్ట మౌతున్న తెలుగుదేశం పార్టీని కాపాడుకోవడం కోసం తనలో బలపడిన మానవతా సంస్కారాలకు ఒక రూపం ఇవ్వాలనే ఆవేదనే బ్రహ్మర్షి విశ్వామిత్ర. దాదాపు 35 సంవత్సరాలు చిత్రపరిశ్రమలో ఉండి తన వ్యక్తిత్వానికి మనస్తత్వానికి సరిపడని రాజకీయరంగంలో అలసిపోయి మానసిక విశ్రాంతికై తనలోని నటుని సంతృప్తికోసం వారు ఆ చిత్రాన్ని నిర్మించడం జరిగింది. బ్రహ్మర్షి విశ్వామిత్ర నిర్మాణ సమయంలో పత్రికలక్కూడా మంచి కాలక్షేపమయింది. చిత్రనిర్మాణంలో కూడా తెలుగు హిందీ సంస్కృతులు కలబోసి నిర్మించారు. సంగీతం పూర్తిగా హిందీ చిత్రరంగానిదే అలాగే నటీనటులు. మీనాక్షి శేషాద్రి, ప్రఖ్యాత ప్రతినాయకుడు అంజాద్‌ఖాన్, ఆనాటి టి.వి.రామాయణ కథానాయిక దీపికలతో హైదరాబాద్ నగరమే కళకళలాడింది.రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవేముంది? చిత్రానికి అందరూ సహకరించారు. ముఖ్యంగా ఈ చిత్రంలో విశ్వామిత్ర పాత్రను ఆయన ప్రత్యేకంగా రూపొందింపచేశారు. కులాలకతీతమైన మానవత్వాన్ని ఉద్దీపింప చేస్తూ ఆయన అలవాటు ప్రకారం ఒక వర్గంలోని ఛాందసవాదాలను తూర్పారబట్టారు. గతంలో కర్ణుడు, దుర్యోధనుడు, వీరబ్రహ్మేంద్రస్వామి పాత్రలన్నీ ఈ వాదం కోసమే ఆయన వాడుకున్నారు. నిజానికి ఆలోచించి చూస్తే అందులోని వాస్తవాలను, ప్రధానంగా క్షత్రియ ప్రశంసను అందరూ అంగీకరించాల్సిందే తను అధికారంలో ఉండడం కూడా కారణం కావచ్చు. బాహుబలంతో సమాజాన్ని రక్షించేది క్షత్రియులే కాని మూలన కూర్చుని ముక్కుమూసుకున్న ఈ ఋషులు కారు అని ఈసడిస్తాడు.

చిత్ర ప్రారంభంలోనే 'విశ్వామిత్ర' పాత్ర ఉద్దేశ్యాన్ని రామారావుగారు తన మాటల్లో విశ్వానికి మిత్రుడుగా సంస్కృతికి నవీనకర్తగా, గాయత్రీ మంత్రాన్ని భూలోకానికి అందించిన మహనీయుడిగా వర్ణించి తన భార్యకు ఈ చిత్రాన్ని అంకితమిచ్చినట్టు చెప్పారు.

ప్రారంభంలో విశ్వామిత్రుడు వేటకువెళ్ళటం, అక్కడ ప్రజలకు 'ఆర్త జనరక్షణే రాజధర్మం, అందుకే ఈనాడు అస్త్రధారణ చేయాల్సి వచ్చింది' అని చెప్పడంతో ప్రారంభిస్తారు. వశిష్టుడి ఆహ్వానంపై విందు భోజనానికి వెళ్ళి తర్వాత ఆ కామధేనువును తనకు ఇమ్మని అడుగుతూ, దానిక్కారణం చెబుతాడు. "ఆర్తితో అన్నార్తితో ప్రజలు అలమటిస్తుంటే ముక్కు మూసుకుని కూర్చోవటం న్యాయమా? కరువులు, కాటకాలు, ఉప్పెనలు, వరదలు తప్పించే బాధ్యత మా క్షత్రియులది. పృథ్వీపతులే ప్రజారక్షకులు కనుక గోవు తన దగ్గరుండడం ధర్మమ"ని చెబుతాడు. ఇందులో యుద్ధం లేదు. బ్రాహ్మం ముందు క్షాత్రం తలవంచిందని చెప్పి రాజలాంఛనాలన్నీ విసర్జించి తపస్సు ప్రారంభిస్తాడు. వశిష్టుడు 'త్రిశంకుని' ఛండాలుని కమ్మని శపిస్తాడు. అప్పుడు విశ్వామిత్రుడు 'ఏమి ఈ జాత్యహంకారం. అయినా మాదిగ కన్య అరుంధతిని వివాహమాడుట సమాజానికి మసిపూయుటకా, సాటిమానవుని ఇలా శపించటం న్యాయమా?" అంటూ విమర్శిస్తాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*